సాక్షి నిజామాబాద్

మంగళవారం, 7, ఫిబ్రవరి, 2023



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

- 10లో ▸



పనులు వేగవంతం చేయాలి

మన ఊరు-మన బడిలో భాగంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.5 /15.8

పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

మైనారిటీ సంక్షేమశాఖ అధికారిగా రమేశ్

నిజామాబాద్‌అర్బన్: మైనారిటీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారిగా రమేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు ఉన్న రతన్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో రమేశ్‌కు ఎస్సీ కార్పొరేషన్ అధికారిగా బాధ్యతలు అప్పగించారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సుభాష్‌నగర్: చిన్నారులకు పౌష్టికాహారం, విద్య అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. సోమవారం కొత్త కలెక్టరేట్‌లో ఐదేళ్ల పాపను కలెక్టర్ చేతుల మీదుగా జర్మనీ దేశానికి చెందిన తల్లిదండ్రులకు దత్తత ఇచ్చారు. ఈసందర్భంగా పాపను దత్తత తీసుకున్న భార్యభర్తలను కలెక్టర్ అభినందించారు. చిన్నారిని జాగ్రత్తగా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు యోగక్షేమాలు తెలుసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, బాలల రక్షాభవన్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్యకుమార్, శిశు గృహ మేనేజర్ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టాల్లో ఉన్న అదానీ గ్రూప్‌లో ప్రజల సొమ్మా?

- ప్రధాని మోదీ వైఖరిపై కాంగ్రెస్ మండిపాటు



నిజామాబాద్ సిటీ: నష్టాలో ఉన్న అదానీ గ్రూపులో ప్రజల సొమ్మును ప్రధాని నరేంద్రమోదీ పెట్టుబడి పెట్టించడం వల్ల కలిగే నష్టాన్ని ఎవరు భరిస్తారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ గ్రూప్‌లో కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసీ, ఎస్‌బీఐలతో పెట్టుబడులు పెట్టించి సామాన్య ప్రజల ధనం దుర్వినియోగం కావడానికి కారణమయ్యారన్నారు. మూడు రోజులుగా పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో అదానీ గ్రూపుపై నిష్పాక్షిక దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగేశ్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ హందాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశ వేణు, నేతలు ముప్ప గంగారెడ్డి, భాగ్య, చంద్రకళ, పోల ఉష, రామర్తి గోపి, వేణు రాజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు అంతంతే..!



చేపూర్‌లోని పామాయిల్ మొక్కల నర్సరీ

అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్

- తెలంగాణ వర్సిటీకి రూ. 39.10 కోట్ల కేటాయింపు
- పామాయిల్ సాగుకు మరింత ప్రోత్సాహం
- పేస్కేల్‌తో 216 మంది సెర్ప్ ఉద్యోగులకు మేలు
- కాళేశ్వరానికి నిధుల కేటాయింపుతో 21, 22 ప్యాకేజీ పనుల వేగవంతం

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. పామాయిల్ సాగుకు రూ.వెయ్యి కోట్లు కేటాయించడంతో జిల్లాలోని రైతులకు మరింత ప్రోత్సాహం లభించింది. పేస్కేల్ సవరణ ప్రకటనతో 216 మంది ఐకేపీ ఉద్యోగులకు మేలు కలుగనుంది. తెలంగాణ వర్సిటీ నుంచి రూ. వంద కోట్లకుపైగా ప్రతిపాదనలు ఉండగా రూ.39 కోట్ల 10 లక్షల 55 వేలు మాత్రమే కేటాయించారు. కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ. కోట్లు కేటాయింపులతో 21,22 ప్యాకేజీ పనులకు ఊతం లభించింది. చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, అలీసాగర్, అర్గుల రాజారాం గుత్ప ఎత్తిపోతలకు నిధులు కేటాయించారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రవేశపెట్టిన రూ.2,90,396 కోట్ల బడ్జెట్‌పై వివిధ వర్గాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీకి రూ.39 కోట్ల 10 లక్షల 55 వేలు కేటాయింపులు చేశారు. అయితే వర్సిటీ నుంచి మాత్రం రూ.110 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ సవరణ చేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో జిల్లాలోని 216 మంది ఐకేపీ ఉద్యోగులకు మేలు కలుగనుంది. వ్యవసాయ రంగానికి రూ.26,831 కోట్లు కేటాయించారు. పామాయిల్ సాగు ప్రోత్సహానికి సంబంధించి రూ.1000 కోట్లు కేటాయింపులు చేశారు. వ్యవసాయపరంగా ముందంజలో ఉన్న జిల్లాలో 6వేల ఎకరాల పామాయిల్ సాగు లక్ష్యం కాగా ఇప్పటికే జిల్లాలో రైతులు 2,400 ఎకరాల్లో పామాయిల్ సాగుకు మళ్లారు. మరింతమంది రైతులు పామాయిల్ సాగు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. బడ్జెట్‌లో పామాయిల్ సాగు కోసం నిధులు కేటాయించడంతో రైతులకు ఉపయోగకరం కానుంది. ఇక ఇరిగేషన్‌కు రూ.26,885 కోట్లు కేటాయించగా ఇందులో కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ.2,614.76 కోట్లు కేటాయింపులు చేశారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో కాళేశ్వరం 21, 22 ప్యాకేజీల పనులు నడుస్తున్నాయి. నిధుల కేటాయింపుతో ఈ పనులు ముమ్మరం అయ్యే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలోని చౌట్‌పల్లి హన్మంతరెడ్డి ఎత్తిపోతలకు రూ.23 లక్షలు, అలీసాగర్‌కు రూ.27 లక్షలు, అర్గుల రాజారాం గుత్ప ఎత్తిపోతలకు రూ.26 లక్షలు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు.



తెలంగాణ యూనివర్సిటీ

బడుగుల బడ్జెట్



పేదల పక్షపాతిగా ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు, బడుగు, బలహీన వర్గాలకు అందరికీ ఎంతో మేలు చేసేదిగా ఉంది. అన్ని రంగాలకు సమృద్ధిగా నిధులు కేటాయించడం సంతోషకరంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే అన్నిరంగాల్లో చాలా వేగంగా అభివృద్ధి చెందుతూ వస్తోంది. తాజా బడ్జెట్‌తో రాష్ట్రం అభివృద్ధిలో మరింత ముందుకు దూసుకువెళ్లనుంది.

– ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

కేసీఆర్ కుటుంబ దోపిడీ బడ్జెట్



కేసీఆర్ కుంటుంబ దోపిడీ బడ్జెట్‌లా ఉంది. నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. సొంత జాగా ఉండి ఇల్లు కట్టుకుంటే రూ. 3 లక్షలు ఇస్తామని మరోసారి ప్రజలను మోసం చేశారు. గత బడ్జెట్‌లోనే రైతు రుణమాఫీకి రూ.5,225 కేటాయించినప్పటికీ మాఫీ చేయలేదు. ఇప్పుడు మళ్లీ రూ.6,385 కోట్లు కేటాయింపులు చూపారు. రైతులకు ఉచిత ఎరువుల ఊసేలేదు. గత బడ్జెట్‌లోరూ. 3,000 కోట్లు నిరుద్యోగభృతి కింద కేటాయించినా ఇప్పటికీ ఇవ్వలేదు. జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయించలేదు.

–బస్వా లక్ష్మీనర్సయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

రైతులను మరోసారి వంచించారు



రూ.20 వేల కోట్లు రైతు రుణమాఫీకి అవసరముంటే రూ.6వేల కోట్లు మాత్రమే కేటాయించడం రైతులను దగా చేయడమే. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు బకాయిదారులుగా ముద్ర పడింది. బడ్జెట్‌లో దళితబంధుకు నిధులు కేటాయించడం తప్ప ఖర్చు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అన్ని రంగాల్లో మసిబూసి మారేడు కాయ చేసి ప్రజలను మోసం చేయాలని కేసీఆర్ ప్రభుత్వం చూస్తోంది.

– మానాల మోహన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

ప్రయోజనం లేదు..



బడ్జెట్‌లో వ్యవసాయానికి ప్రాధాన్యత లేదు. కేటాయింపులు చేస్తున్నారు గానీ ఖర్చు చేయడం లేదు. రైతులకు ప్రయోజనం లేదు. మైక్రో ఇరిగేషన్‌ను ఈ బడ్జెట్‌లో విస్మరించారు. వేల దరఖాస్తులు మైక్రో ఇరిగేషన్‌కు పెట్టుకుంటే ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు కేవలం రూ.1.25 కోట్లు కేటాయించడం దారుణం. ఇప్పటికే క్రమంగా పసుపు సాగు తగ్గుతోంది. ఈ పంటను కాపాడటానికి ఒక్క పైసా కేటాయించలేదు. సాగులో లేని పామాయిల్ సాగు ను ప్రోత్సహిస్తున్నట్లు చూపిస్తున్నారు.

– సుంకేట అన్వేష్ రెడ్డి, చైర్మన్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్

విద్యుత్ ఏసీడీ చార్జీలు రద్దు

- ఇప్పటికే రూ. 3కోట్లు వసూలు



నిజామాబాద్‌నాగారం: ఏసీడీ చార్జీలపై విద్యుత్ వినియోగదారులు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో విద్యుత్‌శాఖ తలొగ్గింది. ఈ మేరకు ఏసీడీ చార్జీలను రద్దు చేస్తున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. అయితే ఇప్పటికే జిల్లాలో 48వేల సర్వీసుల నుంచి రూ. 3కోట్ల వరకు వసూలు చేశారు. ఏసీడీ రద్దు చేయడంపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వసూలు చేసిన సొమ్ము తిరిగిచ్చేనా!

జిల్లాలో వినియోగదారులకు ఏసీడీ బిల్లు జనవరిలో వచ్చింది. దీంతో చాలా మంది వినియోగదారులు చెల్లించారు. సీఎండీ గోపాల్‌రావు సైతం ఏసీడీ బిల్లులు తప్పనిసరిగా చెల్లించాలని ప్రకటన కూడా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, వినియోగదారుల నుంచి తీవ్రస్థాయిలో ఆందోళనలు, నిరసనలు, వినతులు వెల్లువెత్తాయి. ప్రభుత్వం జిల్లా, ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించారు. దీంతో ఏసీడీ చార్జీలు రద్దు చేశామని, నేటి నుంచి వసూలు చేయడం లేదని సీఎండీ తెలిపారు. అయితే ఇప్పటివరకు వసూలు చేసిన బిల్లులు వినియోగదారులకు తిరిగి చెల్లిస్తారో లేదా అనే స్పష్టత లేదు. దీనిపై వినియోగదారులు మాత్రం తాము చెల్లించిన డబ్బులు తిరిగివ్వాలని కోరుతున్నారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని పేర్కొంటున్నారు.

చార్జీలు రద్దు చేశాం

జిల్లాలో ఏసీడీ చార్జీలను రద్దు చేయడం జరిగింది. సీఎండీ ఆదేశాల మేరకు జిల్లాలో ఏసీడీకి సంబంధించిన బిల్లులో ఇక నుంచి వినియోగదారులకు రావు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలి.

– రవీందర్‌రావు, ఎస్ఈ

అర్హులందరికీ ఉచిత న్యాయసేవలు

- రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్

ఖలీల్‌వాడి: అర్హులందరికీ ఉచిత న్యాయసేవలు అందించడమే న్యాయసేవాధికార సంస్థ లక్ష్యమని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ తెలిపారు. సోమవారం జిల్లా కోర్టులోని మూడో అంతస్తులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయాన్ని హైకోర్టు నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ వల్ల అండర్ ట్రయల్ ఖైదీల క్రిమినల్ కేసుల విచారణలు వేగవంతమవుతాయని తెలిపారు. న్యాయసేవల చట్టం బడుగు, బలహీన వర్గాలు, మహిళల న్యాయ సాధికారతకు రూపొందించిన చట్టమని, దీని పరిపూర్ణత కోసం పాటుపడదామన్నారు. జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ జిల్లా కోర్టులోని మూడో అంతస్తులో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయం అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం తరఫున న్యాయసేవాధికార సంస్థ కార్యక్రమాలకు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. సీపీ నాగరాజు మాట్లాడుతూ ప్రాసికూషన్ నిర్వహణలో కోర్టు పోలీస్ అధికారులు, సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులు వెన్నుదన్నుగా నిలుస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ రావు, పంచాక్షరి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు సౌందర్య, గిరిజ, భవ్య, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం గణపతి, బార్ ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సునీత

లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌కు సన్మానం

జిల్లా న్యాయ అధికార సేవాసంస్థలో చీఫ్ డిఫెన్స్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా రాజ్‌కుమార్ సుబేదార్, డిప్యూటీ లీగల్ ఎయిర్ కౌన్సిల్‌గా ఉదయ్‌కృష్ణ, కౌన్సిల్‌గా గంగోని శుభం ప్రమోద్‌లు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారిని సోమవారం న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో సన్మానించారు.

తగ్గుతున్న భూగర్భ జలాలు

- యాసంగి సాగుకు విస్తారంగా నీటి వినియోగం
- జిల్లాలో సరాసరి నీటిమట్టం 21.12 మీటర్లు

మోర్తాడ్(బాల్కొండ): యాసంగి పంటల సాగు ఊపందుకోవడంతో నీటి వినియోగం పెరిగింది. ఫలితంగా భూగర్భ జలాల నీటిమట్టం తగ్గిపోతోంది. గతేడాది కంటే భూగర్భ జలాల నీటిపరిస్థితి బాగానే ఉన్నా రానున్న వేసవిలో నీటికొరత ఏర్పడకూడదంటే నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. గత వర్షాకాలం ఆశించిన దానికంటే వర్షం ఎక్కువగా కురవడంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. యాసంగి పంటలకు నీటి కొరత ఉండదనే ఉద్దేశంతో రైతులు వరి, మొక్కజొన్న, ఎర్ర, తెల్లజొన్నలు, సజ్జ ఇతరత్రా పంటలను సాగు చేయడం మొదలు పెట్టారు. కొన్ని రకాల పంటలకు సాగునీటిని ఎక్కువగా అందించాల్సి ఉండడంతో నీటివినియోగం పెరిగిందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. గత జనవరిలో జిల్లాలోని 82 ఫీజో మీటర్ల నుంచి నీటి పరిమాణం లెక్కలను తీయగా సరాసరి నీటి మట్టం 21.12 మీటర్లుగా నిర్ధారించారు. 2022 అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలతో పోల్చితే ఈసారి నీటి మట్టం తగ్గిపోయింది. 2022 జనవరిలో నీటి మట్టం 25.95 మీటర్లు ఉండగా ఈసారి 21.12 మీటర్ల లోతులో నీరు నిక్షిప్తమైంది. అంటే గతేడాది ఇదే నెలలో నమోదైన నీటి మట్టాన్ని పరిశీలిస్తే కొంత మెరుగ్గానే ఉన్నా.. గత మూడు నెలలతో పోలిస్తే నీటిమట్టం బాగానే తగ్గింది. సాధారణ ఎక్కడైనా నీటి మట్టం పది మీటర్లలో ఉండాలి. అంతకంటే ఎక్కువ లోతులో నీరు ఉంటే అలాంటి ప్రాంతాలను ప్రమాదకరమైనవిగా భావించాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలోని నందిపేట్ మండలం వెల్మల్, నిజామాబాద్ కంఠేశ్వర్, గూపన్‌పల్లి, శివాజీనగర్, రెంజల్ మండలం దూపల్లి, దండిగుట్ట, సిరికొండ మండలం చీమన్‌పల్లి, గడ్కోల్, పాకాల, సిరికొండ, చిన్నవాల్గోట్, ముషీర్‌నగర్, బోధన్ ముప్కాల్, మోపాల్, మాక్లూర్, కమ్మర్‌పల్లి, బోధన్ మండలం సంగెం, చిన్నమావంది, భీమ్‌గల్ మండలం గోనుగొప్పుల, బడాభీమ్‌గల్ ప్రాంతాల్లోనే భూగర్భ జలాలు పది మీటర్ల కంటే ఎక్కువ లోతులో ఉన్నాయి. ఈ ప్రాంతాల వారు నీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు వర్షాకాలంలో నీటిని సంరక్షించే చర్యలకు శ్రీకారం చుట్టాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. యాసంగి పంటల సాగు పూర్తయిన తరువాత నీటి వినియోగం తగ్గినా ముందస్తు చర్యలు తీసుకోక తప్పదని చెబుతున్నారు.



భూగర్భ జలాల వివరాలు

నెల	నీటిమట్టం (మీటర్లలో)	నెల	నీటిమట్టం (మీటర్లలో)
అక్టోబర్	18.04	డిసెంబర్	19.76
నవంబర్	19.48	జనవరి	21.12

కుస్తీమే సవాల్..





జానకంపేట శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర ముగింపు రోజు కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్లయోధులు



కుస్తీ పోటీల్లో విజేత

ఎడపల్లి మండలం జానకంపేట శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. చుట్టు పక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కుస్తీ పట్టడానికి మల్లయోధులు వచ్చారు. విజేతలకు రూ. 100 నుంచి రూ. 2వేల వరకు నగదు బహుమతి ఇచ్చారు. కుస్తీ పోటీలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్/ఎడపల్లి

ప్రభుత్వ ప్రాధాన్యతలు అమలవ్వాలి

సుభాష్‌నగర్ : ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలు జిల్లాలో పక్కాగా అమలయ్యేలా చూడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులకు వివిధ అంశాలపై మార్గనిర్దేశంచేశారు. మండల ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండు పర్యాయాలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. మన ఊరు – మన బడి, కంటివెలుగు, హరితహారం, ఆస్తి పన్ను వసూళ్ల ప్రగతి, వార్షిక పరీక్షల సన్నద్ధత వంటి అంశాలను నిశితంగా పరిశీలించాలన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గమనించిన అంశాలను సంబంధిత మండల, జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చొరవచూపాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో ఆస్తి పన్ను నిర్దేశిత లక్ష్యం మేరకు రాబట్టేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. హరితహారం కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలని, మొక్కల నిర్వహణ గాడి తప్పకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లకిరువైపులా నాటిన మొక్కలు ఎక్కడైనా పాడైపోతే, తక్షణమే వాటి స్థానంలో కొత్తవి నాటించాలని సూచించారు. ఎండల తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నందున మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించేలా పర్యవేక్షణ జరపాలన్నారు. పదోతరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని, ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జెడ్పీ సీఈవో గోవింద్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్ తొలగింపు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ శివారులోని బైపాస్ రోడ్డు సమీపంలో గల తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ జలీల్ అహ్మద్‌ఖాన్, డిప్యూటీ వార్డెన్ జఫీర్ ఉద్దీన్‌ను విధుల నుంచి తొలగిస్తూ (టెర్మినేట్) తెలంగాణ మైనార్టీస్ గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను నిజామాబాద్ రీజనల్ లెవల్ కోఆర్డినేటర్ (ఆర్‌ఎల్‌సీ) తో పాటు ఎస్ ఎస్‌వీ ఏజెన్సీ, హైదరాబాద్ వారికి పంపించారు. ఈ నెల 2న గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం సమయంలో తొమ్మిదో తరగతి విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో సోఫియాన్ అనే విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి మృతి విషయంలో ఆర్‌ఎల్‌సీ నివేదిక ఆధారంగా రాష్ట్ర కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అవుట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్‌లను విధుల నుంచి తొలగించారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘంలో ఖాళీలను జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అధ్యక్షతన సోమవారం ఎన్నుకున్నారు. జి ల్లా ఉపాధ్యక్షుడిగా కేశవ, ప్రధాన కార్యదర్శిగా వడ్ల సురేష్, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడిగా మాయ ప్ర సాద్, పట్టణ యువజన అధ్యక్షుడిగా భరత్, కామారెడ్డి మండల ప్రధాన కార్యదర్శిగా వినయ్‌చారి, తాడ్వాయి మండల అధ్యక్షుడిగా దయాకర్‌లను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయని, బీసీ కుల, జన గణన చేసి జనాభా ప్రతిపాదికన రాజకీయ రిజర్వేషన్లు, నిధులు, నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అరకొర నిధులు కేటాయిస్తూ వాటిని సైతం ఖర్చు చేయడం లేదని వాపోయారు. సంఘం మహిళ అధ్యక్షురాలు మేదరి లక్ష్మి పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ మారిస్తే కేసులు



నిజాంసాగర్: ద్విచక్రవాహనదారులు నంబర్ ప్లేట్లను మారిస్తే కేసులు నమోదు చేస్తామని జుక్కల్ ఎస్సై మురళి అన్నారు. సోమవారం ఖండేబల్లూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపట్టారు. కొందరు వాహనాల నంబర్‌ప్లేట్లు తొలగించడంతో పాటు నంబర్లను మార్ఫింగ్ చేసి జరిమానాలు పడకుండా తిరుగుతున్నారన్నారు. అటువంటి వాహనాలను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పనులు వేగవంతం చేయాలి



పెర్కిట్(ఆర్మూర్) : మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఎంపీ పీఎస్ పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో ఎంపీపీ ఎస్ పాఠశాలలో చేపడుతున్న పనులను సోమవారం ఆర్డీవో పరిశీలించారు. నాణ్యమైన పనులు చేయాలని గుత్తేదారునికి సూచించారు. ఆర్డీవో వెంట సర్పంచి కొత్తపల్లి లక్ష్మీ, ఎంఈవో రాజగంగారాం, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పద్దుపై మిశ్రమ స్పందన

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాలోని పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొన్ని రంగాలకు కేటాయింపులపై కొందరు హర్షం వ్యక్తం చేయగా.. విద్యా రంగానికి కేటాయింపులు సరిపోలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెదవి విరిచారు.



బీసీలకు నిధులేవి?



రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగింది. బీసీల కంటే తక్కువ సంఖ్యలో ఉన్న వారికి ఎక్కువ కేటాయింపులు చేసి, బీసీలకు రూ.6,229 కోట్లు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. జనాభాలో అత్యధిక శాతంగా ఉన్నటువంటి బీసీలకు ప్రభుత్వం కనీసం రూ.20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. – వై ఓమయ్య, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు

రైతు సంక్షేమానికి పెద్దపీట



రైతుల అభ్యున్నతికి వెన్నుదన్నుగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయం, నీటిపారుదల, విద్యుత్ రంగాలకు అత్యధిక నిధులు కేటాయించి పెద్దపీట వేసింది. పంట రుణమాఫీకి నిధులు కేటాయించి సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకున్నారు. – వీఆర్‌దేశాయి, ఏఎంసీ చైర్మన్, బోధన్

తీవ్ర అన్యాయం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి విద్యా వ్యవస్థను అధ్వానంగా మార్చింది. అంకెల గారడీతో ప్రభుత్వం మోసం చేస్తుంది. – దొడ్ల రవీందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి

పెన్షనర్లకు మొండిచేయి



కాలపరిమితి ముగిసినందున పే రివిజన్ కమిటీని నియమించేందుకు నిర్ణయం ప్రకటిస్తారని భావించాం. ప్రతిపాదిత ఎంప్లాయిస్ హెల్త్ స్కీము నిర్వహణలో పెన్షనర్ల, జర్నలిస్టుల వాటా లేకుండానే నగదు రహిత వైద్యాన్ని అందించాలి. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమును రద్దు చేసేందుకు బడ్జెట్లో ప్రతిపాదన లేకపోవడం వేలాదిమంది ఉద్యోగులను నిరాశపరిచింది. – కె రామ్మోహన్‌రావు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు

నిరాశపరిచిన బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మరొకసారి విద్యా రంగాన్ని నిరాశపరిచింది. రూ.19,093 కోట్లు మాత్రమే కేటాయింపులు జరిపింది. మొత్తం బడ్జెట్లో పాఠశాల విద్యాశాఖ 5.54%, ఉన్నత విద్యకు 1% కేటాయింపులు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగంపై చిత్తశుద్ధి లేదని అర్థమవుతుంది. – శంతన్, డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు

మన ఊరు-మన బడిని మరిచిన ప్రభుత్వం



మన ఊరు-మనబడి కోసం అదనపు కేటాయింపులు చేయలేదు. పెండింగ్ కరువు భత్యం, బిల్లుల క్లియరెన్స్, రెండవ విడతలో అమలు కానున్న మన ఊరు-మన బడి పథకం కోసం ప్రత్యేక కేటాయింపులు లేక పోవడంతో ఈ బడ్జెట్ నిరాశ పర్చింది. – వెనిగళ్ల సురేష్, టీపీటీఎఫ్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు

ఊరించే అంకెల బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయించిన నిధుల అంకెలు ఊరిస్తున్నాయి. కార్మిక, ఉపాధి రంగాలకు అరకొర నిధులు కేటాయించి నిర్లక్ష్యం చేశారు. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు నిరాశజనంగా ఉ న్నాయి. జనాభాలో 52 శాతం ఉన్న బీసీల సంక్షేమానికి 2 శాతం నిధులు కేటాయించడం సరికాదు. – పుట్ట వరదయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధి, బోధన్

దళితులను వంచిస్తున్నారు...



కేసీఆర్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తోంది. లెక్కల్లో కోట్ల రూపాయలు చూపించి తీర అర్హులకు అందించడం లేదు. దళిత బంధు కొందరికి మాత్రమే ఇచ్చి రాష్ట్రం మొత్తం ఇచ్చినట్లు చెబుతున్నారు. – ఎమ్మార్పీఎస్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు

విద్యారంగాన్ని విస్మరించారు..



రాష్ట్ర బడ్జెట్ విద్యారంగాన్ని విస్మరించింది. బడ్జెట్‌లో 6.57 శాతం మాత్రమే విద్యారంగానికి కేటాయించడం శోచనీయం. కోఠారి కమిషన్‌తో పాటు అనేక కమిటీలు రాష్ట్ర బడ్జెట్‌లో 20శాతం కేటాయింపులు ఉండాలని పేర్కొన్నప్పటికి కేసీఆర్ ప్రభుత్వం విస్మరించింది. మన ఊరు-మనబడికి ప్రత్యేక నిధులు లేవు. మొక్కుబడి బడ్జెట్‌గా ఉంది. – బి దేవులా, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కామారెడ్డి

ప్రాధాన్యత



బడ్జెట్‌లో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత నివ్వడం హర్షణీయం. గత ప్రభుత్వాలు ఎన్నడూ కేటాయించని విధంగా రూ.19 వేల కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించడంతో విద్యార్థులకు మరింత నాణ్యతతో చదువు అందించడానికి అవకాశం ఉంది. – పెంట జలంధర్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు

సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ హర్షణీయం



చాలీచాలని వేతనాలతో నామమాత్రపు ఉద్యోగ భద్రతతో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తామని ప్రకటించడం హర్షనీయం. పే స్కేల్ ద్వారా సెర్ప్ సంస్థలో పనిచేస్తున్న 3,974 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. – కుంట గంగాధర్‌రెడ్డి, సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం



తెలంగాణ బడ్జెట్‌ను రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఫ్) పక్షాన స్వాగతిస్తున్నాం. అలాగే విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో కొద్ది సంవత్సరాలుగా నిధులు తగ్గిస్తూ వస్తుంది. 30% నిధులు కేటాయించాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాం. – డి సత్యానంద్, టీఎస్ యూటీఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు

బయోటెక్నాలజీలో పీహెచ్‌డీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ పరిశోధక విద్యార్థి ఎం ఎబెనెజర్ పీహెచ్‌డీ సాధించారు. తెయూ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ మామిడాల ప్రవీణ్ పర్యవేక్షణలో 'ఇంప్రూవింగ్ డిఫెన్స్ రెస్పాన్సెస్ ఆఫ్ జెరీబెరా జేమ్స్‌సోనీ అగెనెస్ట్ వెస్టర్న్ పవర్‌థ్రిప్' అనే అంశంపై ఎబెనెజర్ పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. సోమవారం తెయూ బయోటెక్నాలజీ విభాగంలో నిర్వహించిన వైవావోస్ (మౌఖిక పరీక్ష)కు కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ మాలోత్ రమేష్ ఎక్సటర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ప్రిన్సిపల్ సీహెచ్‌ఆరతి, కంట్రోలర్ ఎం అరుణ, బీవోఎస్ చైర్మన్ ప్రసన్నశీల, హెచ్‌వోడీ జవేరియాఉజ్మ, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఎబెనెజర్‌ను రిజిస్ట్రార్ విద్యావర్ధిని, అధ్యాపకులు అభినందించారు.



ఎబెనెజర్‌ను అభినందిస్తున్న రిజిస్ట్రార్

9న ఏఆర్ సెక్షన్‌లో సామగ్రి వేలం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ ఏఆర్ (ఎమ్‌టీ) విభాగంలో పలు వస్తువులకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు సీపీ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలకు వాడి తీసివేసిన టైర్లు, ట్యూబులు, బ్యాటరీలు, ఇంజిన్ ఆయిల్ తదితర వాటికి ఈ నెల 9న ఉదయం 10:30 గంటలకు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దు

సుభాష్‌నగర్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 109 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జెడ్పీ సీఈఓ గోవింద్ వినతులు స్వీకరించారు. కాగా గత సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన నందిపేట్ సర్పంచ్ దంపతుల ఆత్మహత్యాయత్నం, ఇతర సంఘటనల నేపథ్యంలో భద్రతను పెంచారు. ప్రధాన గేట్ వద్దే తనిఖీలు చేసి ఫిర్యాదుదారులను లోనికి అనుమతించారు. కామారెడ్డిలోని ఎక్లారా గురుకుల పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్ తనను నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో..

నగరంలోని రోటరీనగర్‌లో సమస్యలు పరిష్కరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ డ్రెయినేజీ లేక రోడ్లపైనే మురుగు పారుతోందని, భగీరథ పైప్‌లైన్ వేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సాయిలు, రమేష్, జ్యోతి, లక్ష్మీ, చక్రపాణి, నర్సయ్య పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏఈపై చర్యలు తీసుకోవాలి

ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి సబ్ ఇంజనీర్, ఇన్‌చార్జి ఏఈ మూర్తిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఇమ్మడి గోపి సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. డొంకల్ శివారులోని తన పట్టాభూమిలో విద్యుత్ సరఫరా కోసం గతేడాది నవంబర్ 3న 10 డీడీలు కట్టానని తెలిపారు. అడిగిన డబ్బులు ఇవ్వనందుకు తప్పుడు ఎస్టిమేట్ వేసి రూ.3,19,403 ఓఆర్‌సీ కడితేనే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు అవుతుందని చెప్పడంతో పొలం ఎండిపోతుందనే బాధతో చెల్లించానని తెలిపారు. పని జరిగే క్రమంలో అవసరమైన పరికరాలు తెచ్చుకోవాలని, కాంట్రాక్టర్ ద్వారా డబ్బులు ఇప్పిస్తానని చెప్పారని, కానీ ఇప్పుడు అడిగితే ఏం ఇచ్చేది లేదని అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఇన్‌చార్జి ఏఈ మూర్తిపై చర్యలు తీసుకొని, తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

వర్ని మండలంలోని జలాల్‌పూర్ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని వార్డుసభ్యులు సర్పంచ్ అనిత వెంకట్‌గౌడ్‌పై ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాభివృద్ధికి విడుదల చేసిన నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, తప్పుడు లెక్కలు చూపుతూ ఇష్టానుసారంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. వార్డు సభ్యులు భాస్కర్, సాయిలు, మమత, సుధాకర్, స్వప్న, మంజుల పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

క్రైం కార్నర్

గంజాయి రవాణా కేసులో పదేళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: గంజాయి రవాణా కేసులో కామారెడ్డికి చెందిన కుంచెం దేవరాజుకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించారు. ఈ మేరకు కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం శ్యాంశ్రీ సోమవారం వెలువరించిన తీర్పు వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరావు ఆధ్వర్యాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో గత ఏడాది మే 3న తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్విఫ్ట్ కారులో రూ.4.50లక్షల విలువైన 150 కేజీల గంజాయి తరలిస్తున్న కామారెడ్డికి చెందిన కుంచెం దేవరాజు, బోదాసు రాజు, ఉప్పల నరేష్ పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకుని కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా విచారణలో కుంచెం దేవరాజుపై నేరం రుజువు కాగా, మిగిలిన వారిపై రుజువు కాలేదు. దీంతో దేవరాజుకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుమ్మరి రామారావు వాదించగా, హరిగోపాల్, ఏ నాగేశ్వరావు విచారణకు సహకరించారు.

భార్యను పొడిచిన భర్తకు మూడేళ్లు..

బోధన్: కట్టుకున్న భార్యను కల్లు సీసాతో కడుపులో పొడిచిన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధిస్తు సోమవారం బోధన్ కోర్టులో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవాన్ అజయ్ కుమార్ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 15 రోజుల పాటు సాధారణ జైలు శిక్షణ అనుభవించాలని పేర్కొన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్యాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య తెలిపిన ప్రకారం వివరాలు.. బోధన్ మండలం సాలూరా గ్రామానికి చెందిన సవిత అలియాస్ పీరుబాయికి, చందూర్‌కు చెందిన పసుపు శ్రీనివాస్‌తో పదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెళ్లి అనంతరం కొంత కాలానికి మద్యానికి బానిసైన శ్రీనివాస్ భార్యను వేధించడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో కుల పెద్దలు ఇరువురిని సముదాయించారు. అయినా శ్రీనివాస్ వైఖరి మార్చుకోకుండా భార్య వేధించేవాడు. 2020 జూలై 14న భార్యను తలపై కొట్టడంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో పోలీసులు ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించి సవిత పుట్టినిల్లు సాలూరా గ్రామానికి పంపించారు. తనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని మనస్సులో పెట్టుకుని శ్రీనివాస్ కల్లు సీసాతో సవిత కడుపులో పొడిచాడు. సవిత కేకలు పెట్టడంతో శ్రీనివాస్ అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బోధన్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణనంతరం న్యాయమూర్తి ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి దేహశుద్ధి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పోసానిపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చోరీకి పాల్పడిన వ్యక్తికి గ్రామస్తులు సోమవారం దేహశుద్ధి చేశారు. స్వామి అనే వ్యక్తి ఆదివారం రాత్రి అంగన్‌వాడీ కేంద్రంలో పప్పులు, బియ్యం, వంట గిన్నెలతో పాటు హనుమాన్ మందిరం ఆలయ పరిధిలో గల ఇనుప చువ్వలను దొంగిలించినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగిలించిన వస్తువులను సోమవారం పట్టణంలోని పాత ఇనుప సామను దుకాణంలో విక్రయిస్తుండగా గ్రామస్తులు పట్టుకుని చితకబాదారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఒకరి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని హమాల్‌వాడికి చెందిన జక్కుల శ్రీనివాస్ యాదవ్(47) అదృశ్యమైనట్లు మూడో టౌన్ ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 1న శ్రీనివాస్ యాదవ్ తన కొడుకు ధనుష్ యాదవ్‌తో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో సోమవారం ధనుష్‌యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



శ్రీనివాస్‌యాదవ్

లింగాయిపల్లికి చెందిన ఒకరు..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం లింగాయపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన మీసాల గంగయ్య భార్య సుమలత ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇటీవల కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 2న గొడవ పడ్డారు. దీంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన గంగయ్య తిరిగి రాలేదు. దీంతో అతని భార్య సుమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది.



గంగయ్య

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

నిజాంసాగర్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండంలోని కొమలంచ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా గ్రామానికి జౌతి లక్ష్మణ్(37), పద్మ దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నాడు. రోజు కూలీ పనులు చేస్తే తప్ప పూట గడవని కుటుంబం వారిది. భార్య, భర్తలు ఇద్దరూ కూలీ పనులు చేస్తున్న క్రమంలో లక్ష్మణ్ మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం సేవించడానికి డబ్బులు లేకపోవడంతో తరుచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా ఆదివారం రాత్రి చిత్తుగా మద్యం తాగి వచ్చిన లక్ష్మణ్ భార్యతో గొడవ పెట్టుకొని చేయి చేసుకొని చంపుతానని బెదిరించాడు. తాగిన మైకంలో ఉన్న భర్తను చూసి భయాందోళన గురైన పద్మ తన పిల్లలను తీసుకొని రాత్రి వేళ తల్లిగారి ఇంటికి వెళ్లింది. అర్ధరాత్రి వరకు మద్యం తాగిన లక్ష్మణ్ ఇంట్లో ఎవరు లేకపోవడంతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం చుట్టు పక్కల వారు గమనించి సర్పంచ్ సాదుల అనురాధసత్యనారాయణకు సమాచారం అందించారు. ఈ మేరకు సర్పంచ్ పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్సై రాజేశ్వర్ ఘటన స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.



లక్ష్మణ్ (ఫైల్)

మానసిక పరిస్థితి బాగాలేక యువకుడు..

నందిపేట్: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన మోర్తాడ్ ప్రశాంత్(23) మానసిక పరిస్థితి బాగాలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ప్రశాంత్ కొంతకాలంగా మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. సోమవారం ఉదయం మండలంలోని ఐలాపూర్ శివారులో గల ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌ను పట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లితోపాటు అన్న సైతం మానసిక పరిస్థితి బాగాలేక గతంలో చనిపోయారు. మృతుడు తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



ప్రశాంత్ మృతదేహం

జంగంపల్లిలో గల్ఫ్ బాధితుడు..

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లిలో గల్ఫ్ బాధితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన బోమ్మని ప్రణయ్‌కుమార్ (31) మూడేళ్ల క్రితం గల్ఫ్‌దేశానికి బతుకు దెరువు కోసం వెళ్లాడు. అక్కడ కంపెనీలు ఎత్తివేయడంతో ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి గల్ఫ్ వెళ్లి తీవ్రంగా నష్టపోయానని తరచు బాధపడేవాడు. గ్రామం సమీపంలో ఉన్న దాబా హోటల్‌లో కార్మికుడిగా పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం హోటల్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాకపోవడంతో ఆయన భార్య రజిత హోటల్ వద్దకు వెళ్లి అడగ్గా తమ వద్దకు రాలేదని తెలిపారు. సోమవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు గుర్తించారు.

చెరుకు ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

తాడ్వాయి: తాడ్వాయి మండలంలోని క్రిష్టాజీవాడి శివారులో చెరుకు ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కృష్ణాజీవాడి గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మీపతి(55) ఆదివారం రాత్రి తన బైక్‌పై మండలంలోని బ్రహ్మజీవాడి నుంచి స్వగ్రామానికి బయలు దేరాడు. లింగంపేట మండలం ఒంటర్‌పల్లి తండా నుంచి ట్రాలీ ట్రాక్టర్‌లో చెరుకు నింపుకొని వెళ్తున్న ట్రాక్టర్‌ను లక్ష్మీపతి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మీపతి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శ్యామల, కుమారులు రంజిత్, రాకేష్ ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



లక్ష్మీపతి(ఫైల్)

గోదావరిలో పడి ఒకరు..

బాల్కొండ: మెండోరా మండలం కొడిచర్ల గ్రామ శివారులో గోదావరిలో ప్రమాదవశాత్తు జారి పడి అదే గ్రామానికి చెందిన గేదెల కాపరి సాకలి సాయన్న (50) మృతి చెందాడు. మెండోరా ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయన్న, మరో గేదెల కాపరి నాగభూషణంతో కలిసి గ్రామ శివారులోని గోదావరి అంచున గేదెలను మేపుటకు ఆదివారం ఉదయం వెళ్లాడు. సాయన్న కాలకృత్యాల కోసం గోదావరిలోకి వెళ్లి ప్రమాదవశత్తు జారి పడ్డాడు. సాయన్న ఆచూకీ కనిపించడం లేదని కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మత్స్యకారుల సాయంతో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం మధ్యాహ్నం మృతదేహం లభించింది.



మృతదేహాన్ని తీసుకువస్తున్న మత్స్యకారులు

బొలెరో వాహనం ఢీకొని ఒకరు..

బాన్సువాడ రూరల్: మండలంలోని జక్కల్‌దాని తండా సమీపంలో బాన్సువాడ- గాంధారి ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. బాన్సువాడ పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. పిట్లం మండలం కారేగాం గ్రామానికి చెందిన మేతరి అంజయ్య (36) కామారెడ్డిలో తన ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ చేసుకుని పిట్లం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో అంజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

చైన్ స్నాచింగ్

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులోని గాంధీ నగర్‌లో మహిళా మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. గాంధీనగర్‌లో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ పక్కన మంథని గ్రామానికి చెందిన సత్తెమ్మ నేరేడు పండ్లను విక్రయిస్తుంది. పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు నేరేడు పండ్లు కొంటామని ధర ఎంతో చెప్పాలని మాట్లాడుతూ మెడలో ఉన్న గొలుసును లాక్కెళ్లారు. సత్తెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

నస్రుల్లాబాద్ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

బాన్సువాడ టౌన్: నస్రుల్లాబాద్ బీట్ ఆఫీసర్‌ను రెండు రోజుల క్రితం జిల్లా ఫారెస్ట్ అధికారి నిఖిత సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్ రిజర్వ్‌డి ఫారెస్ట్ పరిధిలో లింగంపల్లి ఉంది. లింగంపల్లి కంపాట్‌మెంట్ నంబర్ 276లో సుమారు 20 ఎకరాల అటవీశాఖకు చెందిన భూములు కబ్జాకు గురయ్యాయి. ఫారెస్ట్ భూము లు కబ్జాకు గురైన ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారే కారణంగా బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఫారెస్ట్ భూములు కబ్జాకు సదరు బీట్ ఆఫీసర్ ప్రమేయం ఉన్నట్లు సమాచారం. అటవీ శాఖ భూముల కబ్జాలో స్థానిక రాజకీయ నాయకుల పాత్ర కూడా ఉన్నట్లు తెలిసింది. ఫారెస్ట్ భూములను కాపాడాల్సిన అధికారులే మాముళ్లకు ఆశపడి ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై బాన్సువాడ ఎఫ్‌ఆర్‌వో సంతోషిని వివరణ కోరగా నస్రుల్లాబాద్ బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయడం వాస్తమేనని, ఆమెపై విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.